క్లుప్తంగా

డైనింగ్ హాల్ అభివృద్ధికి గెయిల్ సహకారం

కోటవురట్ల: పాములవాకలోని కిల్లాడ రామ్మూర్తి నాయుడు జెడ్పీ హైస్కూల్‌లో గెయిల్ కంపెనీ సహకారంతో డైనింగ్ హాల్‌ను అభివృద్ధి చేయనున్నట్టు మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలోని డైనింగ్ హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోవడంతో ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్టు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన గెయిల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి డైనింగ్ హాల్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.22 లక్షలు మంజూరు చేయించినట్టు తెలిపారు. దీనికి పరిపాలనాపరమైన అనుమతులు అవసరం ఉండడంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించామని, వెంటనే అనుమతులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థులు మంచి వాతావరణంలో భోజనం చేసేందుకు వీలుకలుగుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మూలపేటలో బ్లీచింగ్ పిచికారీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు కోరారు. మూలపేటలో శుక్రవారం జరుగుతున్న చెత్త తొలగింపుతో పాటు బ్లీచింగ్ పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భీశెట్టి నాగేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు, యల్లపు రాజు, కాండ్రేగుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

మునగపాక: ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ కోరారు. మండలంలోని ఉమ్మలాడలో శుక్రవారం పాడి రైతులకు ఆయన రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పెద్దలు మొల్లేటి ఆనంద్, నరసింగరావు, సూరిశెట్టి రామకృష్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందిస్తున్న సత్యనారాయణ

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. శుక్రవారం పాటిపల్లికి చెందిన ఆడారి జోగినాయుడు జ్ఞాపకార్థం కుమారుడు వెంకట సత్యనారాయణ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాల సీజ్

ఎస్.రాయవరం: మండలంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న నాలుగు లారీలు, మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు శుక్రవారం తెలిపారు. ఉప్పరాపల్లి గ్రామ సమీపంలో నిల్వ చేసిన గ్రావెల్‌ను తరలించేందుకు వినియోగించిన జేసీబీ, మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వేమగిరి గ్రామంలో కొండ నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకుని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి, మైన్స్, రెవెన్యూ అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు.



రక్షణ లేని గేటు రేవుపోలవరం టూరిజం ప్రాంతం



చెల్లాచెదురుగా పడిన టూరిజం చెక్క కాటేజ్



మరమ్మతులకు గురైన కంటైనర్ మరుగుదొడ్లు

కానరాని పర్యాటక హంగులు..!

- అభివృద్ధికి నోచుకోని రేవుపోలవరం తీరం
- అధ్వానంగా పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో పర్యాటక హంగులు కలగానే మిగిలిపోయాయి. మినీ కైలాసగిరిగా పేరొందిన ఇక్కడి కొండ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. తీరానికి రోజురోజుకూ పర్యాటకుల తాకిడి పెరుగుతున్నప్పటికీ సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గతంలో సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.1.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత లేమి కారణంగా అక్కరకు రాకుండాపోయాయి. అప్పటిలో ఏర్పాటు చేసిన టూరిజం కాటేజ్ భవనాలు, కంటైనర్‌లు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారాయి. దీంతో కొత్త హంగులు, సదుపాయాలు మాటేమోగానీ, ఉన్న సదుపాయాలు నిరుపయోగంగా ప్రమాదకరంగా మారాయి.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉంది. ఏకంగా పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత రాష్ట్ర హోంమంత్రి హోదాలో ఉన్నారు. గతంతో పోలిస్తే మరింత అభివృద్ధి పనులు జరుగుతాయనుకున్న మండల ప్రజలకు ఏడాది కాలంగా నిరాశే ఎదురవుతోంది. ఆ ఊసేలేదని గుసగుసలాడుకుంటున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే సిబ్బందిని మాత్రం మార్చి తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకోవడంలో చూపిన చొరవ, అభివృద్ధి పనులపై లేదని విమర్శలు చేస్తున్నారు. మరోవైపు నిర్వహణ నిధులు కాజేయడంలో మాత్రం వెనుకాడడంలేదన్న ఆరోపణలూ ఉన్నాయి. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించని పర్యాటక కేంద్రం నిర్వాహకులు.. నెల నెలా సిబ్బంది పని చేస్తున్నట్టు జీతాలు పేరుతో నిధులు కాజేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవుపోలవరం ప్రాంతంలో పలువురు దాతల సహకారంతో సాయిబాబా, దుర్గమ్మ ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయి. టూరిజం ప్రాంతంలో శివపార్వతులు విగ్రహాలు ఏర్పాటు చేసి మినీ కైలాసగిరిగా తీర్చిదిద్దారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు రేవుపోలవరం తీరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



సువిశాలమైన రేవుపోలవరం తీరం

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



రేవుపోలవరం తీరానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. 8 ఏళ్ల క్రితం చేపట్టిన పర్యాటక ప్రాంతం పనులు తుప్పుపట్టి పోయాయి. సదుపాయాలు లేకపోగా, ఆ ప్రాంతం ఛిద్రంగా మారింది. అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– చేపల సాయిరాం, సాయిబాబా ఆలయ పూజారి, కొత్త రేవుపోలవరం

అభివృద్ధిపై పర్యాటక శాఖకు నివేదిక

రేవుపోలవరం పర్యాటక అభివృద్ధి పనులు పూర్తిగా ఆ శాఖ పర్యవేక్షణలో జరుగుతాయి. అభివృద్ధి పనులను ఇటీవల పరిశీలించాం. మరమ్మతులు గురై అధ్వానంగా ఉన్నాయి. పర్యాటక శాఖకు తెలియజేసేందుకు నివేదిక సిద్ధం చేశాం. అభివృద్ధి జరిగేలా కృషి చేస్తాం.

– సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం మండలం

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో 2025–26 సంవత్సరానికి ప్రవేశాల కోసం (రెండో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు జూలై 15 ఆఖరి తేదీ అన్నారు. జూలై 17 ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు ఆఖరి తేది అని పేర్కొన్నారు. వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేనియెడల పేర్లు మెరిట్ లిస్ట్‌లో కనిపించవని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, కుల, పాస్‌పోర్టు ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఫోన్ నంబరుతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు.

వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉప్పవరంలో రైతులకు శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సీనియర్ నాయకుడు చిన్ని శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు నేతృత్వంలో రైతులకు విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి లోకేష్, నాయకులు గుడాల కనకారావు, భాస్కర్రావు, పెద రమణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అనంతరం వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, సంకల్ప సభ కో-కన్వీనర్ బొడ్డేటి నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు శివారు నీలాద్రిపురం గ్రామంలో రామాలయం వద్ద వికసిత్ సంకల్ప భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కన్వీనర్ వర్మ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపై ప్రతి ఒక్కరికీ అవగాహన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఇన్‌చార్జ్ భరత్, ఎస్.రాయవరం మండల మహిళా అధ్యక్షురాలు వెంకటేశ్వరి, గ్రామ అధ్యక్షురాలు శంకరమ్మ, కార్యదర్శి గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : శ్రీవిష్ణు ఆస్పత్రి, సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు అడిగర్ల సుధీర్, మౌనిక, సందీప్, సత్య, జగదీష్, వెంకట్ పాల్గొని 160 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ లాలం శ్రీను, మాజీ ఎంపీటీసీ ధర్మిరెడ్డి బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయుడు బాబు పాల్గొన్నారు.

‘యోగా పేరుతో ప్రజాధనం వృథా’



ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచి ఆరు వారాలుగా బకాయి పడ్డ వేతనాలు వెంటనే కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న శ్రామికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ యోగా పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. ఎండలో కష్టపడి పనిచేసే శ్రామికులకు పే-స్లిప్పులు, టెంట్, మంచి నీరు, మెడికల్ కిట్టు, తట్ట, పార, గుణపం వంటి నాణ్యమైన పరికరాలు అందించాలన్నారు. సమ్మర్ అలవెన్స్, ఉచిత వైద్యం, మరణిస్తే రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనమివ్వాలన్నారు.

యోగాంధ్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



యోగా చేస్తున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

మునగపాక: విశాఖలో శనివారం జరగనున్న అంతర్జాతీయ యోగా వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను మండల స్థాయిలో నిర్వహించామని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మునగపాకలో శుక్రవారం ఆయన పలు పాఠశాలలను సందర్శించి యోగాంధ్రలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలను పరిశీలించారు. యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. విద్యార్థులను విశాఖకు తీసుకువెళ్లి తిరిగి సురక్షితంగా తీసుకువచ్చే బాధ్యత సక్రమంగా ఉండాలన్నారు. డీటీ శేషుబాబు, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: యోగా డే సందర్భంగా చినగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా ఆంగ్ల అక్షరాల ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు యోగా అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచి యోగా చేస్తే మంచి ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని పీడీ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను హెచ్ఎం బి.శకుంతల అభినందించారు.



చినగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యోగా విన్యాసం

పాయకరావుపేట: యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఒక మహోత్తర కార్యక్రమానికి శ్రీప్రకాష్ క్రీడా మైదానం వేదికైంది. మూడు విడతలుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా శిక్షకురాలు లలిత 300 మంది విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

గణపర్తిలో కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న డెయిరీ డైరెక్టర్ రమాకుమారి

మునగపాక: గణపర్తిలో నిర్మించిన తులసీ కల్యాణ మండపాన్ని శుక్రవారం విశాఖ డెయిరీ డైరెక్టర్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ డెయిరీ ద్వారా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అవసరమైన చోట కల్యాణ మండపాలు నిర్మిస్తున్నామన్నారు. పాల సంఘం అధ్యక్షుడు త్రినాథ్, డైరెక్టర్లు కాండ్రేగుల నాయుడు, సేనాపతి సాయి వంశీ, ట్రస్ట్ కార్యదర్శి పీలా తులసీరామ్, సర్పంచ్ చదరం నాయుడు, మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాంధ్రకు బస్సులు.. ప్రయాణికుల పాట్లు



యోగాంధ్ర కోసం విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సులు

నక్కపల్లి: విశాఖ ఆర్‌కే బీచ్‌లో శనివారం జరిగే అంతర్జాతీయ యోగా డే వేడుకలకు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో సాధారణ ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. వివిధ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు స్కూల్ బస్సులు కూడా ఈ యోగా డేలో పాల్గొనే వారిని తరలించేందుకు ఉపయోగించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులను యోగాడే కోసం కేటాయించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లి టోల్‌గేట్ సమీపంలో వందలాది ఆర్టీసీ బస్సులను రప్పించి వివిధ గ్రామాలకు కేటాయించారు. కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి సుమారు 600కు పైగా ప్రైవేటు పాఠశాలల బస్సులను విశాఖలో జరిగే యోగాడే కోసం వినియోగించడం గమనార్హం. వందలాదిగా ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు రావడంతో జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జాం, రద్దీ ఏర్పడింది.

యోగాంధ్రకు తరలిన అధికారులు, నాయకులు



పాయకరావుపేట నుంచి బస్సులో బయలుదేరిన అధికారులు, నాయకులు

పాయకరావుపేట: విశాఖలో శనివారం ఉదయం జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పాయకరావుపేట నుంచి బయలుదేరి వెళ్లినట్లు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. యోగాంధ్రకు వెళ్లిన వారిలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించలపు పద్మా, యాళ్ళ వరహాలు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కీర్తి సీతారాం, కుందూరు కుమార్, తదితరులు ఉన్నారు.

‘సమర్థంగా రెవెన్యూ పనుల నిర్వహణ’



ఎస్.రాయవరంలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు



నక్కపల్లిలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి



మునగపాకలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

ఎస్.రాయవరం: రెవెన్యూ శాఖ సమర్థవంతంగా పనులు చేసినప్పుడే అన్ని వర్గాల వారికి సంపూర్ణ తోడ్పాటు లభిస్తుందని తహసీల్దార్ జె.రమేష్‌బాబు అన్నారు. ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డీఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో సంఘ అధ్యక్షుడు నూకరాజు, వీఆర్వోలు గోపి, శ్రీధర్, వీఆర్ఏలు రమణ, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత ప్రజలకు వివిధ రకాల సేవలందించడంలో ముందంజలో ఉందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ రెవెన్యూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు, టీడీపీ ఇన్‌చార్జ్ వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరికీ రెవెన్యూ సేవలను సకాలంలో అందించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. రెవెన్యూ దినోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శేషుబాబు, ఆర్ఐ పడాల్, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం గౌరీ పరమేశ్వరుల 205 ఊంజల్ సేవా కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి వేదమంత్రాలతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊంజల్ సేవా కార్యక్రమాన్ని అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు దంపతులు, గౌరీ పంచాయతన దేవాలయం కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం అనుబంధ సంస్థ కోఆర్డినేటర్లు బొగ్గరపు విశాలాక్షి, బొగ్గారపు సీత, పూసర్ల సుధాలక్ష్మి, గౌరీ పంచాయతన ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , కమిటీ సభ్యులు ఆళ్ల మహాలక్ష్మి, నాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో వేల సంఖ్యలో నివసిస్తున్న రిక్షా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా రిక్షా కార్మిక సంక్షేమ ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాల రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని రిక్షా కార్మిక సంఘాల నాయకులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలు ఇప్పటికీ రిక్షా తొక్కడమే జీవనోపాధిగా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారందరినీ ప్రభుత్వం తగిన విధంగా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రిక్షా కార్మిక సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు గురుముపల్లి వెంకట్రావు, కార్యదర్శి పసుపులేటి నీలకంఠం, ఉపాధ్యక్షుడు బుర్లు సోమునాయుడు, కోశాధికారి నూక అప్పారావు పాల్గొన్నారు.